

# అబ్బాయిగారు-అమ్మాయిగారు

కొంపెల్ల విశ్వం

"సుబ్బారావు, సుజాత తొలి చూపులోనే ప్రేమించుకున్నారు."

"ఒకరంటె ఒకరికి చచ్చే యిష్టం."

"వారిద్దరూ కలసి చూడని సినిమా లేదు"

"సుబ్బారావుకి షర్టింగ్‌లు సుజాత సెలక్టు చేస్తుంది సుజాతకి సుబ్బారావు చీరలు కొంటాడు"

"సుబ్బారావు ప్రక్కన ఒక స్త్రీ ఉన్నది అంటే-ఆమె సుజాత. సుజాత ప్రక్కన ఓ పురుషుడున్నాడూ అంటే—అతను సుబ్బారావు."

"వారిద్దరూ ప్రేమించుకున్నారనటానికి ఇంతకన్న నిదర్శనం ఏం కావాలి?" ఇవన్నీ ఆ చుట్టు ప్రక్కల అందరి అభిప్రాయాలు అన్నాడు వాసు.

'ఆ చుట్టు ప్రక్కల ఎవరైనా సుబ్బారావును సుజాత తోటి, సుజాతను సుబ్బారావుతోటి కలిసి చూడలేదంటే వారు గ్రుడ్డివారయినా అవ్వాలి. లేదా ప్రాపంచిక విషయాలు పట్టని పరమ వైరాగ్యులయినా అవ్వాలి' అన్నాడు రమణమూర్తి

"అయితే సుబ్బారావు, సుజాత ప్రేమించుకున్నారంటారు. అంతేనా?" అన్నాన్నేను

"అంతేనా ఏమిటి నీ మొహం! మా కాలనీ అంతా కాలిన పెనంమీద నీటి చుక్కలాగ చుర్రుమంటుంటేనూ!" రమణమూర్తి.

"వెధవ పోలికా నువ్వూను! కాలిన

పెనంమీద నీటి చుక్క ఆవిరయిపోతుంది మరి వీళ్ళ విషయం అలాక్కాదుగా!" వాసు

"ఏదయితేనేం! ఇలా తిరిగితే ఏం బాగుంటుంది? పెళ్ళి చేసుకోవచ్చుగా!" అనుక్షణం సెంటిమెంట్స్‌తో వచ్చే నేను.

"ఏమిటి పెళ్ళా? సుబ్బారావు సుజాతను పెళ్ళి చేసుకుంటాడనే నీ ఉద్దేశం! ఒరే తంబీ! పేకలో నాలుగు క్వీన్స్ ఉంటాయిగానీ. సుబ్బారావు బుర్రలో సుజాత ఎనిమిదో క్వీన్ తెలుసా!"

"నిజంగా?"

"ఏమోరా! ఈ సారి సుబ్బారావు నిజంగానే ప్రేమిస్తున్నాడని నా అనుమానం సుజాత లాటి అమ్మాయి ప్రేమిస్తుంటే "

"నువ్ నోర్మయ్ అసలు ప్రేమంటే ఏమిటో తెలుసా నీకు!"

"నీకు తెలుసేమిటి మహా!"

ఇలా అస్తవ్యస్తంగ సాగింది మా సంభాషణ. ఎంత కొట్టుకు చచ్చినా సుబ్బారావు సుజాతను ప్రేమిస్తున్నాడా. సుజాత సుబ్బారావును ప్రేమిస్తున్నదా? ఒకరంటె ఒకరు "ఇది ?గ ఉన్నప్పుడు పెళ్ళెందుకు చేసుకోరు? లేకపోతే పెళ్ళి చేసుకోకుండా ఇలాగే బాగుందనా ' ఇలాంటి సందేహాలన్నీ మిగిలిపోయాయి

తర్వాత విషయాలెలా వున్నా, వారిద్దరి మధ్య ఉన్నది ప్రేమా, లేక కేవలం స్నేహమా అన్న విషయం తేల్చుకోవా లనుకున్నాం అందుకని ఒక ప్లాన్ కూడా సిద్ధం చేసుకున్నాం

"సుజాత కృష్ణ సినిమా లంటే పడి చస్తుంది సుబ్బారావు 'మందం'టే పడకుండానే చస్తాడు. అందుచేత ఆదివారం నాడు వారిద్దరి ప్రోగ్రాం చెడగొట్టి సుబ్బారావును బార్‌కి తీసిగెడతారు వాసు, రమణమూర్తి సరిగ్గా అదేటయిముకి సుజాతను కృష్ణ సినిమాకు తీసికెళుతుంది మా చెల్లాయి ఇద్దరి ఉద్దేశాలు తెలుస్తాయి" ఇదే ప్లాను

మా చెల్లాయిని ఇందులో ఇరికించటం ఇష్టం లేకపోయినా సుజాత మనసు తెలుసుకోవాలంటే మా చెల్లాయి తప్ప మరెవరూ పనికిరారు అందుకని సరే నన్నాను.

• • •

అనుకున్న ఆదివారం తొందర పడి రాలేదు తొందరపడకుండాను రాలేదు మామూలుగానే వచ్చింది

సుబ్బారావు మందనేసరికి ఎగిరి గంతేసి, సుజాత సంగతి మరచి పోయి మాతో వచ్చేశాడు

సుజాత సుబ్బారావుకి తెలిస్తే ఎక్కడ తగులుకుంటాడోనని మా వారితో సినిమా కెళ్ళిపోయింది

ఆరుద్ర పరిభాషలో —

వాసు, సుబ్బారావు వీరులు కాబట్టి విస్కీ త్రాగుతున్నారు రమణమూర్తి భీరువు కాబట్టి బీరు త్రాగుతున్నాడు

నేను భీరువును కూడ కాదులా వుంది, అందుకే కాఫీ త్రాగుతున్నాను నెమ్మదిగ టాపిక్ కదిపాడు రమణమూర్తి అది చిలవలై పలవలై, కాలువై సుజాత దగ్గిర ఆగిపోయింది

"సుజాత! ఎ బ్యూటిఫుల్ గల్!" అన్నాడు సుబ్బారావు కొంచెం మత్తుగ

"అనుకోనీ, మనకేం బాధ! ఇంకా అనుకోనీ! బాగా అనుకోనీ!!"

"అది కాదు గురూ! మీ రిద్దరూ ప్రేమించుకున్నారని, త్వరలోనే పెళ్ళి కూడ చేసుకోబోతున్నారని అనుకుంటు న్నారు" చెప్పవలసిన విషయాన్ని నీట్‌గ చెప్పాడు వాసు.

"ఏడిశారు, పెళ్ళా, ఇంకా ఏదయినానా?" అన్నాడు సుబ్బారావు

"చూశావా, నేను చెప్పినదే కరక్టు" అన్నట్టు నన్ను గోకాడు రమణమూర్తి.

---

జీవితాన్ని బొమ్మా-బొరుసుతో పోల్చుకోవటం శుద్ధ పొరపాటు!

మరి?! వెరీ సింపుల్. అంతా నటన! దట్సాల్"

---

(ఊరికేనే వచ్చిందేమో, కొంచెం ఎక్కువగానే పట్టేస్తున్నాడు, దొంగ పీనుగ)

"సుజాత, నువ్వు ప్రేమించు కున్నారట, నిజమేనా గురూ."

"ప్రేమెవరు?" అంటాడేమోనని భయపడ్డాను నేను కాని సుబ్బారావు కాన్షస్ లోనే ఉన్నాడు.

"ఎవరు చెప్పారు?" అన్నాడు.

"అందరూ అనుకుంటున్నారు" గొణిగాన్నేను

"కాదు సుబ్బారావ్! ఇన్నాళ్ళు ఆ అమ్మాయితో తిరిగి పెళ్ళి చేసుకోబోతే నలుగురు ఏమనుకుంటారు? పాపం ఆ అమ్మాయి గతేమిటి?" ధైర్యం చేసి అడిగాను నేను

"హ! హ! హ! హ!" తెలుగు సినిమా హీరో విలన్ నవ్వు నవ్వినట్లు నవ్వాడు సుబ్బారావు నవ్వి, గీతోపదేశం చేస్తున్న కృష్ణుని ఫోజు పెట్టి—

"బ్రదర్! ఈ లోకంలో అందినదలా అనుభవించి వదలిన వాడే ధన్యుడు.

ఇప్పుడు మందుంది. ఇందులో ఉన్న మజా ఇక్కడ కొచ్చి కాఫీ త్రాగేవాడికి ఏకేం తెలుస్తుంది? అలాగే సుజాతుంది. సువర్ణుంది, ఉంకో ఉంకో అమ్మాయుంటుంది. ఎవరైనా సరే—అందినప్పుడు అందుబాటులో ఉన్నప్పుడు అనుభవించాల్సిందే? అంతేకాని, పెళ్ళి పెటాకులు అంటూ జీవితాన్ని తక్కువ చేసుకోకూడదు.

ఈ లోకంలో మీ లాగ ఉన్న వాళ్ళందరికి చివరకు మిగిలేది పెద్దసున్నా. ఆ సున్నామీ చుట్టూ గీసుకుని, ప్రపంచంలో ఉన్న ఏ అనుభవాన్ని ఆ బెరి దాటి మీలోకి రానీయరు. అందుకే మీరు పూల్స్!'' అన్నాడు.

నాకు—అసలే వేడి కాఫీ వలన నాలుక పీకుతోందేమో, సుబ్బారావు మీద విపరీతమైన కోపం వచ్చింది సుజాత మీద ఎంతో జాలికల్గింది పాపం! సుజాతమోసపోతోంది ఈ సుబ్బారావు తనని నిజంగ ప్రేమిస్తున్నాడని పెళ్ళి చేసుకుంటాడని అనుకుంటోంది. ఇప్పుడు సుజాత గతేమిటి?

బిల్లు చెల్లించి బైటపడ్డాం. వాసు, సుబ్బారావు ఆటోలో వెళ్ళిపోయారు. నేనూ రమణమూర్తి వడుస్తున్నాం. రమణమూర్తి ఓరు బరువులో ఏదో చెబుతున్నాడు కాని నా చెవులకు సుజాత ఏడుపు వినిపిస్తోంది

* * *

వాణి సినిమా నుంచి వచ్చి, నాకోసం ఎదురు చూస్తోంది. ఇద్దరం అన్నం దగ్గిర కూచున్నాం. కాసేపు వాణి ఏదయినా చెబుతుందేమోనని చూశాను ఇక చూడలేక సుజాత అభిప్రాయం తెలుసుకోకుండ ఉండలేక అడిగాను

''సుజాతనడిగావా ఈ రోజు?''


''లేదు.''

''అడగలేదూ! నిన్ను అష్టకష్టాలు పడి (ఏవో ఎనిమిది సరుకులు తెమ్మని అమ్మ ఠఒ్బిస్తే వాటిలో కమిషన్ మిగుల్చుకుని) సినిమాకు పంపితే అడక్కుండా వస్తావా భాతృద్రోహి!'' అనేవాడిని మరొక సమయంలో అయితే, కాని ఇప్పుడు మూడ్ బాగాలేదు కాకపోయినా నాకు తెలుసు—నేనడక్కపోయినా ఇక ఆ సంగతి గురించి వాణి చెప్పటం మానదని.

''ఈ రోజున నేనేమీ అడగ లేదన్నయ్యా! సినిమా చూసి వచ్చానంతే! కాని మీరీ ప్లాన్ వేయటానికి ముందే సుజాత తనఅభిప్రాయం నాకు చెప్పింది ''

''మరా విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు?''

''నేను చెప్పాననుకో! నా కొకసినిమా లాస్ అదీగాక సుజాత సినిమా కెళ్ళకపోతే సుబ్బారావు మీతో రాలేక పోయేవాడు. నంబర్ త్రీ—సుబ్బారావు అభిప్రాయం కూడ తెల్సుకోవాలనే కోరిక పుట్టింది నాకు. అందుకే చెప్పలేదు.''



''సరేలే! సుజాత అభిప్రాయం చెప్పు!''

''ఊహూ! అదేం లాభం లేదు ముందు నువ్వు సుబ్బారావు అభిప్రాయం చెప్పు.''

"నోనో! లేడీస్ ఫస్ట్ ముందు నువ్వే చెప్పాలి!"

"ఎస్! లేడీస్ ఫస్ట్ కాబట్టి ముందు నేనే వినాలి"

ఎంతయినా వాణి నాకు చెల్లెలు సో-నాకున్న పట్టుదలకి కూడ చెల్లెలు చివరకు ఒక నిర్ణయానికి వచ్చి టాస్ వేయాలను కున్నాం. హెడ్‌నాది. వాణి నా తత్వం తెలి సున్నది కాబట్టి ఒకే ఒకసారి వేయా లంది

నేను క్వాయన్ ఎగుర వేశాను వాణి మధ్యలో చేతితో కొట్టింది క్వాయిన్ దొర్లుకుంటూ పోయి. కత్తెర అడ్డువచ్చి. కత్తిర రెండు కాళ్ళ మధ్యలో గోడగ నిల బడి పోయింది.

ఇద్దరం ఒకరి మొహాలు మరొకరు చూచుకున్నాం.

"నువ్వా కుర్చీలో కూచో! ఆ కాగితం తీసుకుని సుజాత అభిప్రాయం రాయి. నేనీ కుర్చీలో కూచుని, ఈ కాగితం తీసు కుని సుబ్బారావు అభిప్రాయం రాస్తాను. లెటజ్ ఎక్స్ఛేంజ్ దెమ్? ఓకే!" అన్నాను.

"ఓకే!" అంది కుర్చీలో కూచుంటూ కాని అంతలోనే అనుమానం వచ్చి నట్లుంది

"ఇదుగో అన్నయ్యా! నీ లాయర్ తెలివి తేటలన్నీ ఉపయోగించి అసలు విషయం కాకుండ ఏదో చెత్తరాసి నాకిద్దా మని ప్రయత్నించావా, చూసుకో!" అనే సింది వాణి.

"ఛ! ఛ! అలా చేయనులే" అన్నాను రాయటాని కుపక్రమిస్తూ

కాసేపటిలో ఇద్దరం కాగితాలు మార్చు కున్నాం నే నిచ్చిన కాగితం ఒకసారి చూసుకుని తన గదిలోకెళ్ళి పోయింది వాణి

మనిషి ఎదురుగ నుంచుని చెబుతున్న ట్లుంటుంది మా వాణి ఉత్తరాలు రాస్తే!" ఈ ఉత్తరం కూడ అలాగే వుంది.

"అన్నయ్యా!

ఒక రోజున తేదీ గుర్తు లేదు పుకార్లెక్కువగ వినిపించి సుజాత నడి గాను "నువ్వూ సుబ్బారావు ప్రేమించు కున్నారట నిజమేనా!" అని.


"ఎవరు చెప్పారు?" ఎదురు ప్రశ్న వేసింది సుజాత

"నా కొళ్ళు మండింది ' ఎవరు చెప్ప లేదు—అని అడుగు" అన్నాను.

"చెప్పనీ! పనేం లేకపోతే ఏం చేస్తారు?"

"మీ రిద్దరూ తిరిగితే తప్పు లేదుకాని, వాళ్ళు చెప్పుకుంటే తప్పొచ్చిందా!" అడి గాను నేను

"ఏమిటే! ఒకబ్బాయి అమ్మాయి కలిసి తిరిగితే తప్పా! నీకు బొత్తిగ కల్చర్ తెలిసినట్లు లేదు ' అం




"అయితే మీ ఇదరి మధ్య ఉన్నది వటి స్నేహమేనా!" నేనడిగాను

"స్నేహమా, పాడా?"

"స్నేహమూ కాదూ! ప్రేమా కాక స్నేహమూ కాక మరేమిటి?"

"ఫాషన్" అంటూ తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది సుజాత

"సుబ్బారావు ఎర్రగ బుర్రగ, పర్లేదు బాగానే వుంటాడు ఈ సుబ్బారావును పట్టుకుని తిరిగాననుకో! ఇక బాడీ గార్డులా పనిచేసి మన ట్రబుల్సన్నీ తీరుస్తాడు చూడు! ఈ చీర సుబ్బారావు కొన్నదే మనం ఊరికే అతని బట్టలు సెలక్ట్‌చేస్తాం కాని అతను—మనకి సినిమాలు చూపిస్తాడు. పార్కులకి తీసికెడతాడు. మన కోసం డబ్బు తగలేస్తాడు. నీకో రహస్యం తెలీదు. ఆడది ప్రక్కన వుంటే (అమె భార్య కాకుండా వుంటే) అప్పు చేసయినా సరే ఖర్చు పెడతారీ మగవాళ్ళు. పిచ్చిదానా! శకుంతల రామ్మూర్తినీ. పద్మజ ప్రభాకరాన్ని ప్రేమిస్తున్నారను కుంటున్నావా? ఇలా మనవెనకబడ్డ ప్రతి వెర్రి వెధవనీ ప్రేమిస్తున్నా రనుకుంటున్నావా? ఇలా మన వెనకబడ్డ ప్రతి వెర్రి వెధవనీ ప్రేమిస్తూ కూచుంటే ఇంకేమయినా వుందా? వాళ్లు వెనక పడ్తున్నారు మనం పడనిస్తున్నాం అంతే? దట్సాల్!" అంటూ వెళ్ళిపోయింది సుజాత.

—వాణి "

ఉత్తరం పూర్తి చేసి ఏదో ఆలోచనలో ఉండి పోయాను వాణి నేను రాసిన ఉత్తరంతో తన గదిలో నుండి వస్తూ అదోలా నవ్వింది ఇంకేమీ చేయలేక నేనూ అలాగే నవ్వాను. ❋